# బ్లాంక్ చెక్

## ఎస్. జయ

సంధ్యా సమయం, బాల్కనీలో కూర్చొని టీ తాగుతున్నాను. చల్లటి చిరుగాలి హాయిగా ఉంది. కార్తీక మాసం పూర్తయినా ఇంకా చలి ప్రవేశించలేదు. ఈ ఏడాది వర్షాలే సరిగా లేవు. ఇక చలేం ఉంటుంది?! ఓ ఏడాది నుంచి రోజు విడిచి రోజే నీళ్ళు వచ్చాయి. భాగ్య నగరంలో అన్నీ బాధలే. రాబోయే సమస్యలకు మానసికంగా సిద్ధపడడం వల్ల బాధ తగ్గుతుందని నా నమ్మకం.

కృష్ణమోహన్ రాకతో నా ఆలోచనలకు అంతరాయం కలిగింది. చాలా రోజుల తరువాత ఊడిపడ్డాడు. అతన్ని చూస్తుంటే సిటీ బస్సు గుర్తుకొచ్చింది. నిండా జనంతో ఓ వైపు ఒరిగిపోయి ఈడ్చుకుంటూ కదిలిపోయే సిటీ బస్సులా వున్నాడు కృష్ణమోహన్. షాపింగ్ చేసి, సిటీ బస్సులో వచ్చి ఇంకా పది నిముషాలు కూడా కాలేదేమో అవే జ్ఞాపకాలు భయపెడుతున్నాయి.

చూస్తూ ఉండగానే లావైపోయాడు. ఎడం చేయి నిక్కబొడిచి, కుడిచేయి మాత్రమే ఊపుతూ, మెడను కూడా కుడి వైపు వంచి నడుస్తున్నాడు. కాళ్ళకన్నా ముందు పొట్ట నడుస్తోంది. ముప్పై అయిదేళ్ళు నిండాయో లేదో అప్పడే ఆ లావుతో పెద్ద మనిషిలా కనిపిస్తున్నాడు.

"పగటి కలలు కంటున్నావా? లేక ఎవరా అని చూస్తున్నావా?" పలకరించాడు కృష్ణమోహన్ ఇంట్లోకి వస్తూ.

"ఏమిటి సంగతులు" అన్నాను పొడి పొడిగా. ఏదో ఒకటి మాట్లాడాలన్నా మొహమాటం కొద్దీ.

వంటింట్లో పని వుంది. పిల్లలతో హోం వర్కు చేయించాలి. మా వారేమో ఇంకా ఇంటికి రాలేదు. కృష్ణతో కబుర్లు మొదలుపెడితే, ఈ రోజు మాకు పస్తులే. రేపు పిల్లలకు క్లాసులో గోడ కుర్చీలు తప్పవు. కృష్ణ తొందరగా వెళ్ళిపోతే బాగుణ్ణు అనుకున్నాను.

"సంగతులకేం చాలానే ఉన్నాయి. అందుకే మీ ఇద్దరి అభిప్రాయం తెలుసుకుందామని వచ్చాను" అన్నాడు. 'అనుకున్నంతా అయింది' అని మనసులో అనుకున్నాను. "టీ తాగుతావా?" అడిగాను మర్యాద కోసం. "లేదులే, ఇంటి నుంచే రావడం, బోర్నవిటా తాగి వస్తున్నాను. పనీలేమైనా ఉంటే చూసుకో. ఈలోగా నేను పేపరు చూసుకుంటాను." టీపాయ్ మీద నాలుగైదు రోజుల దిన పత్రికలు తీసుకున్నాడు.

"పేపర్ చూస్తానని బిజినెస్ పేజీలు చూస్తున్నావు"

"మాలాంటి వాళ్ళకు కావల్సింది ఇవే కదా! అవునూ, బావ ఇంటికి ఇంకా రాలేదా? అవున్లే... సాయంత్రాలు ఆయనకు కవి సమయాలు కదూ!... ఇరానీ హోటల్ చాయ్ తాగుతూ షాయిర్లు వినడం ఆయనకు ఖుషీ. ఆయనకేం అదృష్టవంతుడు" అన్నాడు.

"నీకేం! తక్కువ"

"అవన్నీ నాకెట్లా సాధ్యం. నువ్వు అయన్నేమీ అనవు. ఇష్టం వచ్చినప్పుడు ఇంటికి వస్తాడు. ఇష్టం వచ్చినప్పుడు నిద్రపోతాడు. బుక్స్ చదువుతూ ఇష్టం వచ్చినన్ని సిగరెట్లు కాల్చేస్తాడు.. బావ సిగరెట్ పెట్టె ఏమైనా మరచిపోయాడా?" టీపాయ్ మీద చెల్లాచెదురుగా ఉన్న న్యూస్‌పేపర్లు అటూ ఇటూ జరిపి అందులోంచి సిగరెట్ పెట్టె బయటకు తీశాడు. కుర్చీ పక్కనే అగ్గిపెట్టె, యాష్ ట్రే ఉన్నాయి. సిగరెట్ వెలిగించి పేపర్ తీసుకొని సీరియస్‌గా చదవడం మొదలుపెట్టాడు.

నా పనుల్లో నేను మునిగిపోయాను. పిల్లలు అన్నాలు తింటుండగా మా వారు వచ్చారు.

"ఏమిటోయ్ తమ్ముణ్ణి అలా వదిలేసి నీ పనుల్లో నువ్వు కూరుకుపోయావు. నేను నిన్ను కష్టపెడుతున్నానని నీ తమ్ముడు అనుకోడూ?! అతిథికి టీ అయినా ఇచ్చావా?" అన్నారు మా వారు కృష్ణమోహన్ పక్కన మరో కుర్చీలో కూర్చుంటూ.

"బావ తన కోసం టీ అడుగుతున్నాడు. అక్కా, నువ్వు బావనేం అనకనే ఆయనిట్లా టీలకు, సిగరెట్లకు బానిసయ్యాడు."

"ఏమిటోయ్ బామ్మర్దీ, ఎప్పుడూ లేనిది నా మీద అసూయ వెళ్ళగక్కుతున్నావు. మా ఇద్దరి మధ్య పచ్చగడ్డి మండించిపోదామని వచ్చావా?" అంటూ ఆట పట్టించారు.

"అంత సాహసం చేయలేను బావా! ఎందుకంటే మీ మధ్య ఎండుగడ్డి వేసి అగ్గి పుల్ల గీసినా అంటుకోదు. అది నీ గొప్ప అనుకున్నావేమో, అక్కకు నీ వంటే అంత ఆరాధన అని నాకు తెలుసు. మీ ఇద్దరి నుంచి కొన్ని సలహాలు తీసుకుందామని వచ్చాను".. వినడానికి సిద్ధమేనన్నట్టు సిగరెట్టు వెలిగించారు మావారు.

"కుడి, ఎడమైనా పొరబాటు లేదని పి.వి. నరసింహారావు ఎప్పటికప్పుడు ఆ వైపో, ఈ వైపో ఒరిగిపోతూ, మూడేళ్ళు లాక్కొచ్చారు. ఇప్పుడు కాంగ్రెస్‌లోనే ముసలం పుట్టింది. అర్జున్‌సింగ్‌ను బయటికి పంపారు. ఓ పక్క మధ్యంతర ఎన్నికలు పెట్టాలని ప్రతిపక్షాలు గోల పెడుతున్నాయి. పి.వి. ప్రభుత్వమే కొనసాగాలని అమెరికా బాహాటంగా ప్రకటించింది. పి.వి.నే ప్రధానిగా కొనసాగుతాడా? లేక మధ్యంతర ఎన్నికలు వస్తాయంటావా?"

"ఏ పార్టీ టిక్కెట్టు కోసమైనా ప్రయత్నిస్తున్నావా?" అడిగారు మా వారు.

"నాకెవరిస్తారు బావా టికెట్టు! షేర్ల గురించి ఆలోచించాలంటే ముందు రాజకీయాల గురించి తెలుసుకోవాలి. ఎవరుంటారు ఎవరు పోతారు అన్న దాన్ని బట్టి ఏ కంపెనీ షేర్లు పెరుగుతాయో తెలుస్తుంది."

"షేర్ల విలువలు ఇప్పుడు బాగా పడిపోతున్నాయ్."

"పడిపోతున్నప్పుడే మంచి కంపెనీ షేర్లు కొంటే లాభం. షేర్లు కొందామా ఘట





కేశ్వర్ వద్ద ఇళ్ళ స్థలాలు కొందామా? ఏదైనా ఫైనాన్స్ కంపెనీ ప్రారంభిద్దామా? రైస్ మిల్ కొందామా? ఉమెన్స్ డిగ్రీ కాలేజీ పెడదామా? ఏమి చేస్తే లాభం అని ఆలోచిస్తున్నాను. అక్కా, మొన్న ఊర్నుంచి భాస్కర్ వచ్చాడు. కలిశాడా? పద్మ పెళ్ళట" అన్నాడు.

మా వారు ముఖం వేలాడేశారు. రాజకీయాలు మొదలుపెట్టి, షేర్లలో పల్టీ కొట్టి, స్వంత వ్యాపారాల్లో మునకలేసి, అంతలోనే స్వంత ఊళ్ళో చిన్నాన్న కుటుంబంలో తేలే సరికి అక్కా తమ్ముడి వ్యవహారం నా కెందుకు అని బుక్ తీసుకున్నారు.

"ఎప్పుడట పెళ్ళి. పెళ్ళి సంబంధాలు చూస్తున్నట్టు మాత్రమే చెప్పాడే భాస్కర్" అన్నాను.

"సంబంధాలు చూడాలనుకుంటే ఇంక పెళ్ళనే కదా"

"బాగుంది నీ వరుస. అమ్మాయి పుట్టింది అత్తారింటికి పంపండి అన్నాట్ట వెనుకటికి నీలాంటి వాడు."

"భాస్కర్ ఇంకా ఏమైనా చెప్పాడా? చెప్పి ఉంటాడే. నాతోనే చెప్పాక, నీకు చెప్పకుండా ఉంటాడా" గుచ్చి గుచ్చి అడిగాడు.

" పెళ్ళి సంబంధాలు చూస్తున్నట్టు మాత్రమే చెప్పాడన్నాను."

"అంతేనా?! అయితే... నీకు పూర్తి వివరాలు చెప్పలేదైతే. చిన్నాన్న అప్పుల్లో కూరుకుపోయాడట. ఈ ఏడాది పద్మ పెళ్ళి చేయాలంటోందట పిన్ని. భాస్కర్ అత్తగారేమో మా అమ్మాయి నగలు మీరు తీసుకోకూడదు అన్నారట. పొలం అమ్మొద్దని చిన్నాన్న అట. కట్నం బాగా ఇచ్చైనా, మంచి సంబంధం చేయాలని పిన్ని. నాకేం పాలు పోవడం లేదని చెప్పాడు భాస్కర్."

"ఊ. అలాగా"

"సిటీకి వచ్చేయమని భాస్కర్‌కు చెప్పాను. ఏదో ఒక ఉద్యోగం దొరక్కపోదు. పద్మ పెళ్ళి వాళ్ళే చూసుకుంటార్లే అన్నాను"

"అదేమిటి అలా చెప్తావు" అన్నాను గాభరా పడుతూ. "కూతురికి మంచి సంబంధం చూడాలనే కదా ఏ తల్లీ, తండ్రీ అయినా అనుకునేది. అదేదో తప్పయినట్టు భాస్కర్ నా సలహా అడగడమేమిటి? వాడి మనసులో ఏముందో తెలుసుకుందామని అడిగాను. చెల్లెలి పెళ్ళి బాధ్యతల్నుంచి తప్పించుకుంటాడా, లేక నన్నేమన్నా డబ్బు సర్దమంటాడా?" అని నవ్వాడు. ఆ నవ్వులో అవహాస్యం తొంగి చూసింది.

కృష్ణమోహన్ నాకు చిన్నాన్న కొడుకు. సిటీలో రియల్ ఎస్టేట్ బిజినెస్ చేస్తూ బాగా సంపాదిస్తున్నాడు.' డబ్బు సంపాదిస్తున్నాను కనుక బెల్లం చుట్టూ ఈగలు ముసిరినంత సహజంగా తన చుట్టూ బంధువులంతా మూగుతారని అనుకుంటాడు కృష్ణ. అతని తత్వం తెలిసిందే.

"ఈ ఏడాది పంట దిగుబడి బాగుంటుందని, చేతికి పంట వచ్చాక, పెళ్ళి పెట్టుకుంటామని భాస్కర్ చెప్పాడు" అన్నాను.

"తెలీక అడుగుతాను, ఇన్నేళ్ళ నుంచి ఆ భూముల్లోనే కదా పండిస్తున్నారు. సంపాదించిందేమీ లేదు. ఈ ఒక్క ఏడాది పంటతో పద్మ పెళ్ళి ఎట్లా చేయగలమనుకుంటున్నారు? భాస్కర్ నా ముందు బయటపడ లేదు కానీ, ఈసారి నేను ఊరికిపోతే, పద్మ పెళ్ళికి డబ్బు సర్దమని పిన్ని తప్పక అడుగుతుంది" అన్నాడు కృష్ణ.

"చెల్లి పెళ్ళికి అప్పు ఇవ్వడం తప్పు లేదులే" అన్నాను.

"అవును మన చెల్లెలి పెళ్ళికి మనం సహాయ పడకపోతే ఎలా" అన్నాడు.

రిస్ట్ వాచ్ చూసుకొని "చాలా టైమయింది. వెళ్ళొస్తాన"ని చెప్పాడు.

"ఇంతకూ నీ తమ్ముడు ఎందుకొచ్చాడో అర్థమయిందా" అన్నారు మా వారు.

"అదేమో కానీ, మా మూడు కుటుంబాల గురించి మేము మాట్లాడుకుంటుంటే, మీరేమో .బుక్ చదువుతూ కూర్చోడం బాగాలేదు" అన్నాను.

"అందరికంటే తాను బాగా సంపాదిస్తున్నానని మనకు చెప్పకోడానికి వచ్చాడు. ఇట్లాంటి కబుర్లు వినడం నాకిష్టం ఉండదని తెలుసునీకు"

* * *

మూడు నెలల తరువాత, ఓ ఉదయం భాస్కర్ శుభలేఖలు తీసుకొని కృష్ణమోహన్‌తో కలిసి మా ఇంటికి వచ్చాడు. కుశల ప్రశ్నలు అయ్యాక, కృష్ణమోహనే చెప్పాడు.

"పద్మకు లక్షరూపాయలు కట్నం ఇస్తున్నారట. పదితులాల బంగారం కూడా

దేశమును ప్రేమించుమన్నా
మంచి అన్నది పెంచుమన్నా
వొట్టిమాటలు కట్టిపెట్టోయ్
గట్టిమేల్ తలపెట్టవోయ్
పాడిపంటలు పొంగిపొర్లే
దారిలో నువు పాటుపడవోయ్
తిండి కలిగితె కండ కలదోయ్
కండ గలవాడేను మనిషోయ్

— గురజాడ

పెడుతున్నారట. మన బంధువర్గంలోనే ఎవరికీ ఇవ్వనంత కట్నం. చూడబోతే పెళ్ళికొడుకు బి.ఏ. బి.ఇడి. ఈ మధ్యజరిగిన టీచర్ పోస్టింగ్ ఇంటర్వ్యూలో సెలెక్ట్ అయ్యాడట. ఇంత కట్నం ఇవ్వగలమని చిన్నాన్ననో, పిన్నినో నాతో చెప్పి ఉండాల్సింది. లెక్చరర్‌నో, బిజినెస్ మాన్‌నో చూసేవాడ్ని•ఇప్పటికైనా మించి పోయింది లేదు. మంచి సంబంధం చూద్దామంటున్నాను. భాస్కర్ ఒప్పకోడం లేదు"

"మంచి సంబంధం చూడ్డం మాట్లాడినంత తేలిక కాదులే. పెళ్ళికి రమ్మని శుభలేఖలు పట్టుకొస్తే ఇట్లా మాట్లాడి నిరుత్సాహ పరచడం బాగోలేదు. సిటీలో ఏ ప్రైవేటు కాలేజీలోనో పనిచేస్తూ నెలకు ఏడొందలు సంపాదించే లెక్చరర్ కూడా మూడులక్షలకు తక్కువ తీసుకోవడం లేదు. అదిసరే. పెళ్ళికి ఎప్పుడు బయలుదేరుదాం?" విషయం మార్చడం కోసం అడిగాను.

'పెళ్ళి ఇంకా పదిరోజులుంది. ఆదివారం పెళ్ళి• గురువారం రాత్రి బయలుదేరుదామని అనుకున్నాం. మా రెండు కుటుంబాలకు ఒకే బస్సులో టికెట్లు రిజర్వేషన్ చేయిస్తానని కృష్ణమోహన్ చెప్పాడు. పెళ్ళికి రెండు రోజుల ముందే మేమంతా వస్తున్నామని విని భాస్కర్ కూడా సంతోషించాడు.

* * *

వారం ఇట్టే గడిచిపోయింది. ఈ లోగా ఒక్కసారి కూడా కృష్ణమోహన్ మా ఇంటి వైపు రాలేదు. రాత్రే మా ప్రయాణం. ఉదయం. నుంచి ఎదురు చూస్తున్నాను. రిజర్వేషన్ చేయించాడా లేదా? చేయించి ఉంటే ఎన్నిగంటల బస్సుకు? బస్సు ఎక్కడ్నుంచి బయలు దేరుతుంది? ఇవి ఏవీ తెలియక సాయంత్రానికంతా నాకు టెన్షన్ పెరిగింది. పిల్లలతో పెళ్ళిళ్ళ సీజన్‌లో దూరప్రయాణాలు చేయడం కష్టం. రిజర్వేషన్ లేకుండా ప్రయాణమంటే మా వారికి సుతారం నచ్చదు ప్రయాణం



ఉంటుందో లేదో నన్న సందిగ్ధంతో బట్టలు సర్దాను. మనసు స్థిమితంగా లేక ఏవి పెట్టానో చూసుకోడానికి రెండుమూడు సార్లు సూట్‌కేస్ తెరిచి చూశాను. మరో పక్క పిల్లలిద్దరూ తమను రెడీ చేయమని గోలచేస్తున్నారు. నా ఆరాటాన్ని ఏమీ పట్టించుకోకుండా మావారు బుక్స్ ఆల్మైరా సర్దుతున్నారు. చివరకు ఓ నాలుగు బుక్స్ తీసుకొని, షేవింగ్ బాక్స్‌తో సహా పిల్లల బట్టలున్న ఏయిర్ బాగ్‌లో సర్దారు.

ఏదో గుర్తొచ్చి షర్టు జేబు తడుముకున్నారు. "సుమతీ! ప్రయాణం అవసరాలకని వేయిరూపాయలు డ్రా చేశాను. సరిపోతాయి కదా, నా దగ్గర యాభై ఉంచుకుంటున్నాను." మిగిలిన డబ్బు నాచేతికి ఇచ్చారు. చూస్తే ఏడు వందలే ఉన్నాయి. ఆమాటే చెప్పాను. "మనకు టికెట్లు రిజర్వు చేశాను." టికెట్లు కూడా ఇచ్చారు. "కృష్ణమోహన్ నుంచి ఏ సంగతి తెలియలేదని ఉదయం నుంచి టెన్షన్‌తో చచ్చిపోతున్నాను. టికెట్లు రిజర్వేషన్ చేస్తున్నట్టు చెప్పలేదు"

"నీ తమ్ముడి మీద నీకు భరోసా ఉండొచ్చు కానీ నాకు లేదు. ఆఫీసు నుంచి వస్తూ మనకు మాత్రమే రిజర్వేషన్ చేయించాను"

"కృష్ణమోహన్ రిజర్వేషన్ చేసి ఉంటే ఎట్లా?"

"ఈ అనుమానంతోనే నన్ను టికెట్లు రిజర్వుచేయనీయవ ని నీకు చెప్పలేదు. టికెట్లు వేస్ట్ అవుతాయోమోనని భయం వద్దు. నిశ్చింతగా ఉండు. నిన్ననో, ఈ. రోజు ఉదయమో కృష్ణమోహన్ వాళ్ళు ఊరికి వెళ్ళి ఉంటారు. రేప్పొద్దున తీరిగ్గా మన దగ్గరికి వచ్చి, టికెట్లు ఎందుకు రిజర్వుచేయలేదో కథ చెబుతాడు విను" అన్నారు. వెటకారంగా.

మేము ఊరికి చేరాక తెలిసింది. మావారు చెప్పినట్టే కృష్ణమోహన్ వాళ్ళు గురువారం ఉదయమే ప్రయాణం పెట్టుకొని సాయంత్రాని కంతా ఊరు చేరారు.

క్షేమ సమాచారాలు, స్నానాలు, టిఫెన్లు అంతా సందడిగా జరిగిపోయాయి కాసేపట్లో పద్మపెళ్ళి సంబంధం గురించి ఎన్నో విషయాలు చెప్పింది మావదిన. మా అమ్మ రెండు రోజులుగా పెళ్ళి పనుల్లో పిన్నికితోడుగా పెళ్ళింట్లోనే ఉంటోందని చెప్పింది. 'కీ' చైన్ చూపుడు వేలుతో తిప్పకుంటూ కృష్ణమోహన్ వచ్చాడు.

"ఎంతసేపయింది మీ రొచ్చి, మేము నిన్న మధ్యాహ్నమే వచ్చాం. రాత్రిళ్ళు బస్సు దోపిడీలు జరుగుతాయి, భయ మంది మా ఆవిడ. పగలు టికెట్టు రిజర్వేషన్ ఉండదు. అదేమేలని వచ్చేశాం. రిజర్వేషన్‌కోసం తిరిగితే డబ్బు, టైం వేస్టు" అన్నాడు.

"అలా అనుకున్నప్పుడు ఆఫీసుకు ఫోన్ చేసి మీ బావకు చెప్పొచ్చు కదా!" అన్నాను.

"ఫోన్ చేయాలని గుర్తు రాలేదు. కానీ, అక్క ఎదురు చూస్తుంది అనుకున్నాను. అయినా నా కోసం ఎదురు చూస్తూ ఎంత సేపుంటారు? పెళ్ళికి రావల్సిందేగా? ప్రయాణం ఆపుకోలేరులే అనుకున్నాను" తేలిగ్గా నవ్వేశాడు.

........

"బస్సులో ఎంత రద్దీ వున్నా పిల్లల్ని ఎవరో ఒకరు దగ్గరికి తీసుకుంటారు. పాపం అని అక్కకూ ఆడవాళ్ళు చోటు ఇస్తారు. బావ ఒక్కరే కదా, రెండు గంటలు జడ్చర్ల వరకు నిల్చుంటే సీటు దొరుకుతుంది. ఆ మాత్రం కష్టపడితే నేంలే అనుకున్నాను." చెప్పకుండా బయలుదేరి రావడం సరైంది కాదని కొంచెం కూడా బాధపడడం లేదు కృష్ణమోహన్. పైగా తాము చాల తెలివిగా డబ్బు మిగుల్చుకుని సుఖంగా ప్రయాణంచేశామని, మీరు నానా కష్టాలు పడి వుంటారు. అయినా పడితేనేం అన్న తేలిక భావం ఆ మాటల్లో కనబడింది. కృష్ణ ప్రవర్తనకు మనసు చివుక్కుమంది.

పైగా రెట్టించి మరీ అడిగాడు మా వారిని "ఏం బావా! ఒక రాత్రి నిద్ర లేకపోతేనేంలే. వేన్నీళ్ళ స్నానం చేస్తే కాళ్ళ నొప్పలు, వొళ్ళు నొప్పలు పోయి హాయిగా నిద్ర వస్తుంది" అన్నాడు ఇంకా హేళనగా నవ్వుతూ.

......

తెలు గదెలయన్న దశంబు తెలుగేను
దెలుగు వల్లభుండ దెలుగొకండ
ఎల్ల నృపులు గొలువ నెఱుగవే బాసాడి
దేశభాషలందు దెలుగు లెస్స

— శ్రీకృష్ణదేవరాయలు

శిలలు ద్రవించి యేడ్చినవి, జీర్ణములైనవి తుంగభద్రలో
పల, గుడి గోవురమ్ములు, సభాస్థలులైనవి కొండ్రముచ్చు గుం
వులకు, చరిత్రలో మునిగిపోయివ దాంధ్రవసుంధరాధిపో
జ్జ్వల విజయ ప్రతాపరభస మ్మొక స్వప్న కథా విశేషమై



– కొడాలి సుబ్బారావు

"శివరాం కనపడడేం, అక్కా బావ వచ్చారు. మర్యాద చేయొద్దా. కోడినికోసి పెట్టమని చెబుతాను" అన్నాడు.

నా వుట్టింట్లో కూడా నాకేం పెట్టాలో పెత్తనం చెలాయిస్తున్నాడే అనుకున్నాను. బయటికి అనడానికి నా సంస్కారం అడ్డొచ్చింది.

"శివరాం సంగతి సరే. మీ ఇంట్లోనే కోడి తినాలని వుంది. ఈ రోజే వద్దులే. మేము వెళ్ళేలోగా పెట్టించు" అన్నారు మా వారు.

"మా ఆవిడకు వంట సరిగా రాదే, మీరు తింటారా... అని"

"మీ ఆవిడ చేతి వంట తినే కదా, నువ్వు పెళ్ళి తరువాత ఇంత లావయ్యావు"

"వండింది వూర్తిచేయకపోతే, అలిగి కూర్చుంటుంది. నాకైతే తప్పదు. మీరు..."

"మా చెల్లెమ్మ లేకుండా ఆమె వంట గురించి మాట్లాడే హక్కు మనకు లేదు. అది సరే. నువ్వు సంతోషపడుతున్నట్లుగా మేమేం కష్టాలు పడలేదు. సుఖంగా ప్రయాణం సాగింది." ఒక్కసారి పొగ పీల్చుకొని సుతారంగా వదిలేస్తూ, "బావమరిదిని నమ్ముకోడానికి నువ్వు కృష్ణుడివి కావు, నేను అర్జునుడిని కాను" అన్నారు. మా వారి మాటల్లో అతిశయం ఉట్టిపడుతోంది.

కృష్ణమోహన్ మాట మార్చుతూ, "శివరాం ఇంట్లో లేడా" అంటూ మా వారి పక్కనే మంచం మీద కూర్చున్నాడు.

"తోటలో పల్లికాయ బాగా పండిందట. తెస్తానని వెళ్ళాడు. పచ్చి పల్లికాయను పొలంలోనే కాల్చుకొని తెస్తానన్నాడు. అవి లింటూ నవల చదువుకోవాలి" తను చేయబోయే పనిని ఓ కార్యక్రమంగా వివరించడం మా వారికి అలవాటు.

"ఎక్కడికి వెళ్ళినా నీ చుట్టూ ఆనందం నింపుకుంటావు. అదృష్టవంతుడివి బావా నువ్వు" మా వారి వద్ద సిగరెట్ ఇప్పించుకొని వెలిగించాడు.

"నీకొచ్చిన కష్టమేదో చెప్పరాదు" అభయ హస్తం ఇస్తున్నట్టు ఫోజు పెట్టారు మా వారు.

"అన్నీ కోరి తెచ్చుకునే కష్టాలే. ఏమని చెప్పను."

"సిగరెట్ కొని తాగవు. మా చెల్లమ్మ కోప్పడుతుందని సాకు చెబుతావు. నువ్వు కష్టాలు కోరి తెచ్చుకుంటావంటే ఎట్లా నమ్మను" అన్నారు వెటకారంగా.

బావమరుదుల మధ్య పరాచకాలు ముదురుపాకాన పడుతున్నాయనిపించింది.

మా వారు అంతమాట అంటారని కలలో కూడా ఊహించలేదు. కృష్ణమోహన్ వారానికి ఒకటి రెండుసార్లు మా ఇంటికి వస్తాడు. వచ్చినప్పుడం సిగరెట్ ఇప్పించుకొనే తాగుతాడు. దానికి రోజూ తనే సిగరెట్లు కొని ఇస్తున్నట్లు మాట్లాడ్డం, మా వారి పద్ధతి నాకు నచ్చలేదు.

"మీకేం తెలుసు నా కష్టాలు. బయటికి అలా వెళ్లొస్తాననో, అక్కావాళ్ళను కలసి వస్తాననో అంటానా, సిగరెట్ తాగడానికేగా వెళ్ళేది అంటూ నస పెడుతుంది మా ఆవిడ. అంతెందుకు ఇప్పుడు చూడరాదు! పద్మ పెళ్ళి కోసం చిన్నాన్నకు డబ్బు కావాల్సి వస్తుందేమోనని బ్లాంక్ చెక్ తీసుకొని వచ్చానా!? 'ఎందుకు తెచ్చావు, ఎంతిస్తావు' అని ఆరాలు తీయడమే. ఈ ఊరికి రాగానే ఆ విషయం మా అమ్మకూ చెప్పింది. ఇంట్లోంచి కదలనీయడం లేదు. ఇద్దరూ కలిసి నా ప్రాణాలు తోడేస్తున్నారు" అని బిక్కమొగం పెట్టాడు.

నిజంగానే కష్టాలు కోరి తెచ్చుకోవడమంటే ఇదే కదా. ఏవేవో చేద్దామనుకుంటాడు. ఏమీ చేయలేక తప్పించుకోడానికి నానా తంటాలు పడుతుంటాడు.

మధ్యాహ్నం భోజనాల తరువాత పెళ్ళింటికి వెళ్ళాను మా పిన్ని చిన్నాన్న వాళ్ళను పలకరిద్దామని. అక్కడ కూర్చున్న కాసేపట్లోనే అర్థమయిది నందికొట్కూరు నుంచి భాస్కర్ రాకకోసం మా పిన్ని ఆదుర్దాగా ఎదురు చూస్తోంది.

"ఉదయమే భాస్కర్ నందికొట్కూరు వెళ్లాడు. పల్లికాయ అమ్ముతానని చెప్పి ఆయిల్‌మిల్ వ్యాపారి వద్ద అప్పు తీసుకుని, ఆ డబ్బుతో బ్యాంకులో వున్న పిన్ని నగలు తీసుకురావాలని" మా అమ్మ చెప్పింది.

చివరి క్షణాల దాకా ఆగారనిపించింది.

ఆదే మా అమ్మతో అన్నాను.

"నీకు తెలియంది ఏముంది. మామూలే. ప్రతి రైతు కుటుంబంలో జరిగేదే"

.....

"పది రోజుల క్రితం ఊళ్ళోని వ్యాపారి ఒకడు పల్లికాయ కొంటానని కొంత పైకం అడ్వాన్సు ఇచ్చాడు. రెండు మూడు రోజుల్లోనే పైకమంతా ఇస్తానన్నాడు. నిన్నటిదాకా తప్పించుకు తిరిగి నిన్న రాత్రి. నా వల్ల కాదని తేల్చాడు. చేతిలో డబ్బు లేదంటాడు. కాయ అమ్ముకొని వచ్చి ఇస్తానంటాడు. పం మో ఇంకా పొలం మీదేవుంది. ఇంకో పది రోజులకు కానీ కాయ తెంచడం కుదరదు"

మా అమ్మ చెబుతుండగా ఇంతలో భాస్కర్ రానే వచ్చాడు. మొహం వాడి పోయి వుంది. నల్లబడి చెమటలు పట్టి వుంది.

"వెళ్ళిన పని ఏమైంది" మెల్లిగా అడిగాడు చిన్నాన్న. లేదన్నట్టు తలూపాడు భాస్కర్.

పిన్ని కళ్ళల్లో నీళ్ళు నిండాయి.

"ఈ రోజు బ్యాంకు సమ్మెట... వ్యాపారి రేవు రమ్మన్నాడు" భాస్కర్.

"రేవు శనివారం. గంటా గంటన్న వరకే బ్యాంకు పనిచేస్తుంది. వ్యాపారి డబ్బు బ్యాంకులోంచి డ్రా చేయించి, మన చేతికి ఇస్తే మళ్ళీ మనం దాన్ని బ్యాంకుకు తీసికెళ్ళి నగలు విడిపించుకోడానికి టైముండదు. ఆదివారం మళ్ళీ బ్యాంకుకు సెలవు. ఎట్లా చేసేది" చిన్నాన్న ఆలోచనల్లో పడ్డాడు.

"పద్మకు నా నగలు పెట్టాలని సంబంధం కుదిరినప్పుడు అనుకున్నాం. నగలు ఏం పెట్టారని వియ్యావు వాళ్ళడిగితే ఏం చెప్పేది" పిన్ని కొంగుతో కన్నీళ్ళు ఒత్తుకుంది.

"ఏమిటి జానకీ చిన్న పిల్లలాగా ఏడుస్తావు. నా నగలూ పెడదాం. పెళ్ళి తరువాత చూసుకోవచ్చు" అమ్మ తన బంగారుగాజులు, గొలుసు, నెక్లెస్ తీసి పద్మకు వేసింది. గుట్టుచప్పుడు కాకుండా సమస్య అంత తేలిగ్గా పరిష్కారం అయినందుకు ఆశ్చర్యపోయాను. ఆత్మీయత, అనుబంధాలతో ఒకరికొకరు తోడు నిలవడం చూసి నా మనసు ఆనందంతో పులకించింది.

విడిదిల్లు ఒకసారి చూసి రమ్మని మా అమ్మ నాకు పని పురమాయించింది. ఆడవాళ్ళ అవసరాలు నన్ను చూడమని, మగవాళ్ళ విషయాలు కృష్ణమోహన్‌ను చూడమందామని చెప్పింది మా అమ్మ.

"నిన్ననగా వచ్చాడా?! ఇంతవరకు ఇక్కడికి రాలేదు. పనేం చేస్తాడు" అంది పిన్ని నిష్ఠూరంగా.

బ్లాంక్ చెక్ జేబులో పెట్టుకున్నానని అందరికీ చెప్పకుంటూ, సహాయం అడుగుతారేమోనని పిన్ని, చిన్నాన్న వాళ్ళను తప్పించుకు తిరుగుతున్నాడేమో ననిపించింది.

విడిదిల్లు వరండాల్లో వాలు కుర్చీలో కూర్చొని బుక్ చదువుకుంటున్నారు మా వారు. కుర్చీ పక్కన పల్లికాయ తొక్క, ఖాళీ చాయ్ కప్పు, నలిపేసిన సిగరెట్ పీక చూసి తేలిగ్గా ఊపిరి పీల్చాను. మా వారు అరగంటకోసారి చాయ్ తాగుతారని అందరికీ తెలుసు. ఎవరో ఒకరు అందిస్తారని, ఇక పెళ్లి పనుల్లో నేను నిశ్చింతగా వుండొచ్చు అనిపించింది.

కృష్ణమోహన్ మాటలు వినిపించి ఇంట్లోకి వెళ్ళాను. పొట్ట ముందుకు కనిపించేలా నిలబడి, ప్యాంటు జేబుల్లో చేతులు పెట్టుకొని ఓ పెద్ద ఆఫీసరు గుమస్తాతో మాట్లాడుతున్నట్టు భాస్కర్‌కు చెబుతున్నాడు కృష్ణమోహన్.

"కట్నం అంతా పెళ్ళిలోనే ఇస్తున్నావా, లేక వాయిదాలు ఏమన్నా కోరాలనుకుంటున్నావా? డబ్బు తక్కువైతే చెప్ప, పెళ్ళి కొడుకుతో మాట్లాడతాను. కట్నం వూర్తిగా ఇవ్వకపోతే తాళి కడతావా లేదా అని అడుగుతాను. తలకు మించిన బరువు ఎత్తుకుంటే కష్టం. బరువు ఎత్తుకునే ముందే ఆలోచించాలి. ఏమైనా సహాయం చేద్దామనిపించినా నాకు, ఇది మీకు అలవాటు అవుతుంది"

కృష్ణమోహన్ మాటలు విని నేను, మా వారు చిరాకుపడ్డాం.

"బామ్మర్దీ సిగరెట్ వుందా?" అని పిలిచారు.

"లేదుబావా!" అంటూ వచ్చాడు.

"అగ్గి పెట్టె?!"

"ఆ. వుంది." షర్టు జేబులోంచి తీశాడు. దానితో పాటు చెక్ లీఫ్ బయటకు తొంగి చూసింది. మా వారు ఒడుపుగా దాన్ని చేజిక్కించుకొని అగ్గివుల్ల గీసి అంటించారు.